# సాక్షి ఏలూరు

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025






**దళితులపై దాడులు దారుణం**

కైకలూరు మండలం దానగూడెంలో దళితులపై జరిగిన దాడులను వివిధ సంఘాలు, వలు పార్టీల నాయకులు ఖండించారు. 8లో ▸



**వ్యాన్ బోల్తా.. కూలీలకు గాయాలు**

ఏలూరు నగర శివారు జాతీయ రహదారిపై వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడగా 15 మంది కూలీలు గాయాలపాలయ్యారు. 8లో ▸



**మేం బానిసలం కాదు..**

మేం బానిసలం కాదు.. ప్రభుత్వ ఉద్యోగులమంటూ సచివాలయ ఉద్యోగులు పోరుబాట పట్టారు. నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### అమెరికా సుంకాలు రద్దు చేయాలి



ఏలూరులో వామపక్ష పార్టీల నిరసన

ఏలూరు (టూటౌన్): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశ వస్తువులపై విధించిన సుంకాలను రద్దు చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సుంకాలను రద్దు చేసేలా అమెరికాపై ఒత్తిడి తేవాలంటూ శనివారం ఏలూరు పాత బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బాలరాం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుంకాలను 50 శాతానికి పెంచినా ప్రధాని మోదీ నోరుమెదకపోవడం దారుణమన్నారు.

### హాస్టళ్ల తరలింపు దారుణం



కొయ్యలగూడెంలో దీక్షలు

కొయ్యలగూడెం: బీసీ బాలుర వసతి గృహాలను కొయ్యలగూడెం నుంచి తరలించడం తగదని, ఇక్కడే కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రభుత్వాన్ని శనివారం డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన రహదారి వద్ద రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న దీక్షకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. దశాబ్దాల కాలం నుంచి కొయ్యలగూడెంలో బీసీ హాస్టళ్లు కొనసాగుతున్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటిని బుట్టాయగూడెం, జీలుగుమిల్లికి తరలించారని, ఇది అధికారులు, రాజకీయ నాయకుల స్వార్థమే అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన సీపీఐ మండల కార్యదర్శి ఆంజనేయరాజు ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగుతున్నాయి. ట్రెజరర్ క్రాంతికుమార్ తదితరులు మాట్లాడారు.

### 11, 12వ తేదీల్లో జిల్లాస్థాయి కళా ఉత్సవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్నట్టు దూబచర్ల డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 48 మండలాలకు చెందిన 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు కేఎస్‌వీకే రాజ్‌కుమార్‌ను 89195 59615, సి.శ్యామ్యూల్ సంజీవ్‌ను 99123 08303లో సంప్రదించాలని కోరారు.

### శ్రీవారి క్షేత్రంపై గ్రహణం ఎఫెక్ట్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమ చినవెంకన్న క్షేత్రంపై శనివారం గ్రహణం ఎఫెక్ట్ పడింది. నామమాత్రంగా భక్తులు విచ్చేశారు. చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఆలయాన్ని మూసివేస్తామని, తిరిగి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తామని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు.

### భూసేకరణ వేగిరపర్చాలి

ఏలూరు (మెట్రో): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్అండ్ఆర్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ భూసేకరణపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

**చెరువు మరమ్మతులకు ప్రతిపాదనలు**

జిల్లాలోని 1,513 మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి మరమ్మతులు, పునరుద్దరణ, పునర్నిర్మాణాలపై ప్రతిపాదనలను నెలాఖరులోపు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

**పటిష్ట నిఘా** : జిల్లా నుంచి ఎరువులు తరలిపోకుండా జిల్లా, అంత ర్రాష్ట సరిహద్దుల వద్ద చెక్‌పోస్ట్ లు ఏర్పాటుచేసి పటిష్ట నిఘా పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎరువుల లభ్యత, సరఫరాలపై సమీక్షించారు.

### రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు

ద్వారకాతిరుమల: స్థానిక కాపు కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు రెండు రోజులపాటు నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ 50వ రాష్ట్రస్థాయి పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ డైరెక్టర్ సీహెచ్ఎఆర్‌కే వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుమారు 6 వందల మంది క్రీడాకారులు హాజరయ్యారు. శనివారం క్రీడాకారులను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి రోయింగ్ క్రీడాకారుడు ఉదర్ల విజయ్ తదితరులున్నారు.

# ఎనీవేర్‌కు కేరాఫ్ ఉండి

కాళ్ల మండలం కలవపూడిలో దాదాపు రూ.2.50 కోట్ల విలువైన 1.68 ఎకరాల గ్రామ కంఠం భూమిని జూన్ 30న ఒక సబ్ రిజిస్ట్రార్ తన భర్త పేరిట రిజిస్ట్రేషన్ చేసేశారు. ఈ విషయమై ఫిర్యాదు అందడంతో జూలై 15న రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఈ విషయమై విచారణ కొనసాగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

కృష్ణా జిల్లా చినగొల్లపాలెంకు చెందిన ఏలూరి రంగబాబు కుటుంబానికి చినగొల్లపాలెంలో 32 ఎకరాల సాగు భూమి ఉంది. కొందరు ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫేక్ రిజిస్ట్రేషన్ చేయించి ఈ భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు రంగబాబు ఆందోళనకు దిగారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అందుకు కొమ్ముకాస్తున్నారంటూ టెంట్ వేసి నిరసన తెలిపారు.

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమాలు దండి
- ఒకరి భూమి మరొకరి పేరుపై ఉండిలో రిజిస్ట్రేషన్
- రెండు నెలలుగా సెలవులోనే సబ్ రిజిస్ట్రార్
- గ్రామ కంఠం భూమిని రిజిస్టర్ చేసేసిన మరో సబ్ రిజిస్ట్రార్
- రిజిస్ట్రేషన్ల కోసం పొరుగు జిల్లాల నుంచి జనం క్యూ
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు



ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి, భీమవరం/ ఉండి: పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు లోపభూయిష్టంగా జరుగుతున్నాయా? అమరావతి, చుట్టుపక్కల జిల్లాల వారు రిజిస్ట్రేషన్ల కోసం ఇక్కడికి క్యూ కడుతున్నారా?.. అంటే అవుననే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడకుండా భూములు, స్థలాలను ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ప్రభుత్వం 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్' వీలు కల్పించింది. సాధారణంగా నిషేధిత జాబితాలోని భూములు, స్థలాలపై స్థానిక సబ్ రిజిస్ట్రార్లకు అవగాహన ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు, వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించి అన్నీ సవ్యంగా ఉన్నాయనుకుంటేనే రిజిస్ట్రేషన్ చేస్తుంటారు. బయటి ప్రాంతాల్లోని వారికి ఈ భూములపై అవగాహన ఉండదు. బయటి ప్రాంతాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఏరియాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అన్నీ ధ్రువీకరించుకున్న తర్వాతనే రిజిస్ట్రేషన్లు చేయాలి. అయితే ఎనీవేర్ సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేస్తూ కొందరు అక్రమాలకు తెరలేపుతున్నారు. గతంలో మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బయటి ప్రాంతాలకు చెందిన నిషేధిత జాబితాలోని భూముల రిజిస్ట్రేషన్ చేశారన్న విషయంలో సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకున్నారు. అయినా కొందరి తీరులో మార్పు రావడం లేదు.

**వందలాది ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు**

ప్రస్తుతం ఉండి, ఆకివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ తరహా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలల్లో ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 1,013 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్లు చేయగా వీటిలో 300 లకు పైగా ఇతర జిల్లాలకు చెందిన వారివే ఉన్నాయి. ఆకివీడులో వెయ్యికి పైనే రిజిస్ట్రేషన్లు జరగ్గా అక్కడ కూడా ఇదే పరిస్థితి ఉన్నట్టు సమాచారం. కృష్ణా జిల్లా బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, మండవల్లి, ఉయ్యూరు, ఏలూరు జిల్లా కైకలూరు, ప్రకాశం జిల్లా కనిగిరి, పల్నాడు జిల్లా గురజాల, గుంటూరు జిల్లా పెదకాకాని, జంగారెడ్డిగూడెం, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన వారి రిజిస్ట్రేషన్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఎనివేర్ రిజిస్ట్రేషన్లకు సంబంధించి పూర్తి సమాచారం ఇచ్చేందుకు ఉన్నతాధికారుల అనుమతులు కావాలంటూ అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. మంగళ, శుక్రవారాలు, అమావాస్య రోజుల్లోనూ బయట జిల్లాల వారితో ఆయా కార్యాలయాలు కళకళలాడుతుంటాయని తెలిసింది. ఆయా కార్యాలయాల వద్ద లేఖర్లదే ఇష్టారాజ్యమంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పాతుకుపోయిన కొందరు అన్నీ తామై వ్యవహరిస్తుంటారన్న ఆరోపణలు ఉన్నాయి.

గణపవరానికి చెందిన కురెళ్ల రాజ్‌కుమార్‌కు ఏలూరు జిల్లా కలిదిండి మండలం పటమటిపాలెంలోని 9 సెంట్ల భూమి ఉంది. ఏప్రిల్ 24న ఉండి సబ్ రిజిస్ట్రార్ ఈ భూమిని అదే గ్రామానికి చెందిన మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసేశారు. విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సవరణ పేరుతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసినట్టుగా విచారణలో నిర్ధారణ అయ్యింది. సబ్ రిజిస్ట్రార్ దాదాపు రెండు నెలలుగా సెలవులో ఉన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ బాధితుడు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఇప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. కాగా సమస్యను పరిష్కరించి ఉండి ఎస్సై చేతుల మీదుగా రాజ్‌కుమార్‌కు ఎండార్స్‌మెంట్ ఇచ్చినట్టు నాలుగు రోజుల క్రితం పీజీఆర్ఎస్ సైట్‌లో అధికారులు ఫేక్ ఫొటోను అప్‌లోడ్ చేశారని బాధితుడు ఆరోపిస్తున్నారు.

### ఫేక్ ఫొటోతో అర్జీ క్లోజ్



నా భూమిని నాకు స్వాధీనం చేయకపోవడంతో పాటు వేరే వారి పేరిట తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు, లేఖర్లపైనా చర్యలు తీసుకోవాలి. ఉన్నతాధికారులను అడుగుతుంటే సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్నారని చెబుతున్నారు. ఈ విషయమై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా నాకు న్యాయం జరగలేదు. సమస్యను పరిష్కరించినట్టుగా ఫేక్ ఫొటో అప్‌లోడ్ చేసి నా అర్జీని క్లోజ్ చేశారు.

– కురెళ్ల రాజ్‌కుమార్, గణపవరం

## ఆక్వాకల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్డి



తాడేపల్లిగూడెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం ఆక్వాకల్చర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పడా మాజీ వైస్ చైర్మన్, రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంను శనివారం నియమించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేపట్టినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటనలో తెలిపింది. గత ప్రభుత్వంలో అప్పడా వైస్‌చైర్మన్‌గా నిరంతరం రైతుల వెంట ఉన్న వడ్డి రఘురాం ఈ రంగానికి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఆక్వా రంగంలో విశేష సేవలందించడానికి వీలుగా తనకు ఈ పదవిని ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి రఘురాం ధన్యవాదాలు తెలిపారు. ఆయన నమ్మకానికి తగ్గట్టుగా రైతులకు సేవలు అందిస్తానన్నారు.

## యూరియా కొరత.. రైతుల వ్యథ



పెదపాడు సొసైటీలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారు. కొరత లేదంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. యూరియా ఎప్పుడు వస్తుందా అని రైతులు సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారు. శనివారం యూరియా లోడు వచ్చిందని తెలిసి ఏలూరు, పెదపాడు పరిసర ప్రాంతాల రైతులు సొసైటీల వద్దకు రాగా కనిపించిన దృశ్యాలివి.

- సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు/పెదపాడు



చొదిమెళ్ల సొసైటీలో..



వేచిచూస్తూ..

## కుక్కునూరులో రైతుల ఆగ్రహం



కుక్కునూరు మండలానికి సరిపడా యూరియాను పంపామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం తమకు అందడం లేదని రైతులు అంటున్నారు. శనివారం మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం గంటల తరబడి వేచి చూడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియాతో పాటు ఎఫ్-20 ఎరువులను కూడా తీసుకోవాలని చెప్పడంతో మండిపడ్డారు. యూరియా బస్తా రూ.260 అయితే ఎఫ్-20కి రూ.వెయ్యి వరకు వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు. యూరియాతో పాటు అటాచ్‌మెంట్ కొనాలని నిబంధన పెట్టడం సరికాదని, కూటమి ప్రభుత్వం రైతుల బతుకులతో చెలగాటం ఆడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. -కుక్కునూరు

## 9న వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు

- యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం
- రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ ఉద్యమం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, సమన్వయకర్తలు విజయరాజు, జయప్రకాష్

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచీ రైతన్నలకు కష్టాలు మొదలయ్యాయని, కనీసం ఎరువులు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న ఏలూరులో చేపట్టే అన్నదాత పోరు నిరసన కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని, అన్నదాతల పక్షాన ఉద్యమిస్తామన్నారు. 9న ఉదయం 10 గంటలకు ఏలూరు జిల్లాలో మూడు చోట్ల అన్నదాత పోరు నిరసన కార్యక్రమాలు చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ఆర్డీఓ కార్యాలయాల వద్దకు రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లి, కొద్దిసేపు నిరసన అనంతరం ఆర్డీఓలకు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే రైతులకు యూరియా సహా అవసరమైన ఎరువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రిస్తూ, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలన్నారు. కనీసం పంటలకు గిట్టుబాటు ధరను కల్పించలేని దుస్థితిలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఎరువులను బ్లాక్ చేస్తూ వందల కోట్లు కాజేస్తున్నారని ఆరోపించారు. రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందని ఎద్దేవా చేశారు.

**రైతు కష్టాలు పట్టవా?**

ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ ఏలూరులో రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ అనంతరం నిరసన చేపడతామన్నారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వానికి రైతుల కష్టాలు పట్టించుకునే తీరిక లేదన్నారు. చింతలపూడి సమన్వయకర్త కంభం విజయరాజు మాట్లాడుతూ మార్క్‌ఫెడ్‌కు ఇవ్వాల్సిన 50 శాతం యూరియాను తగ్గించి ప్రైవేట్‌కు కేటాయించడం దుర్మార్గమన్నారు. దీంతో యూరియా బ్లాక్ మార్కెట్‌కు వెళ్లి బస్తా రూ.450 నుంచి రూ.600కు విక్రయిస్తున్నారన్నారు. ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి దాసరి రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమరాడ స్రవంతి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా రామ్మోహనరావు, మైనార్టీ విభాగం కార్యదర్శి ఎస్‌కే గాజుల బాజీ, వాణిజ్య విభాగం కార్యదర్శి భాస్కర్ల వెంకట బాబి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పాతినవలస రాజేష్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు సముద్రాల దుర్గారావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా కార్యదర్శి కంచుమర్తి తులసీ, మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు చిలకపాటి డింపుల్ జాబ్, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, కామవరపుకోట మండల అధ్యక్షులు రాయకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లకు నో ఎంట్రీ



తనిఖీలు చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై ఈనెల 4న 'సాక్షి'లో ప్రచురించిన 'ప్లాస్టిక్‌పై సమరం.. ప్రచారానికే పరిమితం' కథనంపై ఆలయ అధికారులు స్పందించారు. ప్లాస్టిక్ కవర్లు ఆలయంలోకి వెళ్లకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద భక్తులను క్షుణ్ణంగా పరిశీలించి లోనికి పంపిస్తున్నారు. అయితే ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించాలంటే క్షేత్రంలోకి కవర్లు రాకుండా చూడాలని పలువురు అంటున్నారు. దేవస్థానానికి చెందిన కొబ్బరికాయలు, ఫ్యాన్సీ దుకాణాల్లో కవర్ల విక్రయాలను అరికట్టాలని కోరుతున్నారు.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రిటైర్డ్ హెచ్‌ఎం

- దేశద్రోహం కేసు అంటూ బెదిరింపు
- రూ. 42.50 లక్షలు కాజేసిన వైనం

ఏలూరు టౌన్: దేశద్రోహం చర్యలకు పాల్పడుతున్నట్టు కేసు నమోదయ్యిందంటూ వీడియో కాల్ ద్వారా బెదిరించి ఓ రిటైర్డ్ హెచ్‌ఎం నుంచి రూ.42.50 లక్షల సొమ్ములను సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడు ఏలూరు రూరల్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరు రూరల్ మాదేపల్లి హేలాపురి టౌన్‌షిప్ ప్రాంతానికి చెందిన యార్లగడ్డ రాఘవేంద్రరావు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన పిల్లలు వేరే ప్రాంతంలో సెటిల్ కావటంతో భార్యతో కలిసి జీవిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఆయనకు వీడియో కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి పోలీస్ యూనిఫాం ధరించాడు. రాఘవేంద్రరావుపై దేశద్రోహం కేసు నమోదు అయ్యిందనీ, నాన్ బెయిల బుల్ కేసులో అరెస్ట్ వచ్చిందనీ వెంటనే విజయవాడ పోలీసులను సంప్రదించాలని, లేదంటే తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో భయపడిన రాఘవేంద్రరావు మొదట రూ.16 లక్షలు సైబర్ నేరగాడి బ్యాంకు ఖాతాలో జమచేయగా.. పలు దఫాలుగా రూ.42.50 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించారు. చివరకు తాను మోసపోయినట్టు గ్రహించి ఏలూరు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. రూరల్ ఎస్సై నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుంతల్లో పడి మొరాయించిన అంబులెన్స్

తమ ప్రభుత్వ హయాంలో రోడ్లు వేయకపోయినా, గోతుల్లేని రహదారులుగా తీర్చిదిద్దుతామంటూ వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ఆచరణలో ఆ ఊసే మరిచింది. పశ్చిమగోదావరి జిల్లాలోని రహదారులు గుంతలమయంగా మారి నరకానికి నకళ్లుగా మారుతున్నా, పట్టనట్టు వ్యవహరిస్తోంది. శనివారం వీరవాసరం-నవుడూరు రహదారిపై బుదారాయుడు చెరువు గ్రామం వద్ద గుంతల్లో పడి 108 అంబులెన్సు ప్రమాదానికి గురైంది.

- వీరవాసరం



## క్లుప్తంగా

### రూ.16.63 లక్షలకు లడ్డూ వేలం



వేలంలో లడ్డూను దక్కించుకున్న మాధవరావు

**నూజివీడు:** మండలంలోని మిట్టగూడెం వినాయక చవితి నవరాత్రుల్లో విఘ్నేశ్వరుడికి ప్రసాదంగా ఏర్పాటుచేసిన 11 కేజీల లడ్డూకు శనివారం వేలం నిర్వహించగా రూ.16.63 లక్షలకు మాజీ ఎంపీటీసీ కొనకళ్ల మాధవరావు దక్కించుకున్నారు. గతేడాది సైతం లడ్డూను వేలంలో రూ.9.09 లక్షలకు మాధవరావు సొంతం చేసుకున్నారు. సర్పంచ్ కొనకాల నరసింహారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### 12 వేల కిలోల గోమాంసం పట్టివేత

**బుట్టాయగూడెం:** కలకత్తా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఒక కంటైనర్‌ను జీలుగుమిల్లి పోలీసులు శనివారం తనిఖీ చేసి అందులో సుమారు 12,100 కేజీల గోమాంసాన్ని పట్టుకున్నారు. గ్రామశివారులోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కంటైనర్‌లో ఏదో తరలిస్తున్నట్లు అనుమానంతో తనిఖీ చేయగా గోమాంసాన్ని గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ మాంసాన్ని నిర్జీవ ప్రదేశంలో ఖననం చేశారు.

# బానిసలం కాదు.. ప్రభుత్వ ఉద్యోగులం

- సచివాలయ ఉద్యోగుల పోరుబాట
- సర్వే డాష్‌బోర్డు నింపకుండా నిరసన
- ఇంటింటి సర్వేలు నిషేధించాలని డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు



ఆకివీడులో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు



రాష్ట్రవ్యాప్తంగా కేవలం 12 సచివాలయాల్లో మాత్రమే సర్వే చేసినట్టు డాష్‌బోర్డులో నమోదైన దృశ్యం

**సాక్షి, భీమవరం:** మేము బానిసలం కాదు.. ప్రభుత్వ ఉద్యోగులమంటూ సచివాలయ ఉద్యోగులు పోరుబాట పట్టారు. ఇంటింటి సర్వేలు నిషేధించాలంటూ శుక్రవారం నిర్వహించాల్సిన వాట్సప్ గవర్నెన్స్ ఇంటింట అవగాహన సర్వేను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాలకు గాను కేవలం 12 సచివాలయాల్లో మాత్రమే సర్వే చేసినట్టుగా డాష్‌బోర్డులో అప్‌లోడ్ చేయగా.. జేఏసీ పిలుపు మేరకు మిగిలిన ఉద్యోగులు సర్వేను బహిష్కరించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వ్యయప్రయాసలకోర్చి ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన పనిలేకుండా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. రాజకీయ జోక్యం, అవినీతి, అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల నియామకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రెండు వేలు, పట్టణ ప్రాంతాల్లో నాలుగు వేల జనాభా ప్రాతిపదికన జిల్లాలో 535 సచివాలయాల పరిధిలో ప్రస్తుతం 4,434 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వీరిలో సచివాలయ సెక్రటరీ, ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, వెటర్నరీ, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, విలేజ్ సర్వేయర్ తదితర ఉద్యోగులు ఉన్నారు. సచివాలయానికి వెళితే చాలు అన్ని పనులు జరిగేలా 500కు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆయా సేవలను బట్టి తక్షణ, కొన్ని 72 గంటలు, మరికొన్ని వారం నుంచి రెండు వారాల వ్యవధిలో పరిష్కరించేలా గడువు పెట్టారు. గత ప్రభుత్వంలో కేవలం దరఖాస్తు చేసుకున్న గంటలోనే రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరుచేసిన సచివాలయాలు ఎన్నో ఉన్నాయి.

**కూటమి కుట్రలు**

గతంలో నవరత్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరి గడప చెంతకు చేరేలా వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ సచివాలయ ఉద్యోగులు పనిచేసేవారు. కాగా సంక్షేమాన్ని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో జాబ్‌చార్ట్‌లో లేని పనులు చేయిస్తూ వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. వలంటీర్ల పనులను వారితో చేయిస్తూ మొత్తం పనిభారం ఉద్యోగులపై మోపింది. హౌస్‌హోల్డ్, ఎంఎస్ఎం తదితర సర్వేల పేరిట ఇంటింటికి తిప్పుతూ వెట్టిచాకిరీ చేయిస్తోంది. కూటమి వచ్చాక కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సొంత సర్వేలకు సచివాలయ ఉద్యోగులను వినియోగించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. హేతుబద్ధీకరణ పేరిట 3,500 జనాభా పైబడిన సచివాలయాల్లో ఎనిమిది మంది, 2,500 నుంచి 3,500 జనాభా ఉన్న చోట ఏడుగురు, 2,500 లోపు జనాభా ఉన్నచోట ఆరుగురు ఉద్యోగులను కొనసాగించే అంశాన్ని కూటమి తెరపైకి తెచ్చింది. మరోపక్క ఉద్యోగుల బదిలీల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల సిఫార్సు లెటర్లకు ప్రాధాన్యమిస్తూ రాజకీయ జోక్యానికి తెరలేపింది. తాజాగా ప్రతి శుక్రవారం వాట్సప్ గవర్నెన్స్ అవగాహన సర్వేలు నిర్వహించాలంటూ గురువారం సచివాలయ ఉద్యోగులకు మౌఖిక ఆదేశాలందాయి. ఈ విషయమై సచివాలయ ఉద్యోగుల జేఏసీ స్పందించింది. ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే వలంటీర్ విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం భీమవరం, ఆకివీడు, జిల్లా వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు వాట్సప్ సర్వీస్ రిజిస్ట్రేషన్లను ఉద్యోగులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. దీంతో జిల్లాలో 535 సచివాలయాల పరిధిలో ఒక్కచోట కూడా వాట్సప్ రిజిస్ట్రేషన్లు జరుగలేదు.

### గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితులను అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**నరసాపురం రూరల్:** గంజాయి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.40 వేలు ఖరీదు చేసే 1.938 కిలోల (సుమారు రెండు కిలోలు) గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు, రూ.4 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై నరసాపురం ఎస్సై సీహెచ్ జయలక్ష్మికి వచ్చిన సమాచారం మేరకు నరసాపురం- పాలకొల్లు రోడ్డులోని వీరభవాని ఆలయం వెనుక గల ఖాళీ స్థలంలో పోలీసులు నిఘా వేశారు. ఉండి ఎన్ఆర్‌పీ అగ్రహారంనకు చెందిన కాలుకురస ఏసురాజు నరసాపురం వీవర్స్ కాలనీకి చెందిన పృధ్వీసాయి శివకుమార్, పిచ్చుక ఉదయ్‌కిరణ్‌లకు విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు పంపగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఏసురాజు ఏలూరుకు చెందిన మణికంఠ వద్ద గంజాయిని కొని నరసాపురానికి చెందిన వ్యక్తులకు విక్రయిస్తున్నాడని, మణికంఠను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. నరసాపురం డీఎస్పీ శ్రీవేద ఆదేశాల మేరకు టౌన్ సీఐ బి యాదగిరి ఆధ్వర్యంలో జరిపిన ఈ దాడుల్లో ఎస్సై ముత్యాలరావు, హెడ్ కానిస్టేబుళ్లు వేణుగోపాలరావు, ప్రకాష్ బాబు, కానిస్టేబుల్ చక్రవర్తి పాల్గొన్నారు.

### తగ్గుతున్న గోదావరి వరద

**పోలవరం రూరల్ :** గోదావరి వరద క్రమేపీ తగ్గుతోంది. పోలవరం వద్ద 31.700 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే నుంచి 7.97 లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు చేరుతోంది. దిగువ వరద ప్రవాహం ఇంకా కొనసాగుతోంది. భద్రాచలం వద్ద 36.80 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# దళితులపై దాడులు దారుణం

బాధితులను పరామర్శించిన సంఘాలు, పార్టీల నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని బాధితులను పరామర్శిస్తున్న నేతల రమేష్ బాబు

**ఏలూరు (టూటౌన్):** కైకలూరు మండలంలో దానగూడెంలో దళితులపై జరిగిన దాడులను వివిధ సంఘాలు, పలు పార్టీల నాయకులు ఖండించారు. బాధితులను పరామర్శించి దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై దాడులు పెరిగిపోయాయని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ విమర్శించారు. స్థానిక ఎన్ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై దాడులకు తెగబడటం సరికాదన్నారు. న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు. సమావేశంలో గొల్ల కిరణ్, కనికెళ్ల రవిప్రసాద్, పెరియార్ పాల్గొన్నారు.

**తక్షణమే అరెస్టు చేయాలి**

దళితులపై హత్యాయత్నం చేసిన దోషులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని దళిత బహుజన్ సీనియర్ నాయకుడు నేతల రమేష్ బాబు డిమాండ్‌చేశారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత యువకులను ఆయన పరామర్శించారు. దళితులపై హత్యాయత్నానికి పాల్పడిన జనసేన నాయకులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. కై కలూరులో జరిగిన దాడిని పోలీసులు ఇరువర్గాల ఘర్షణగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

**ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

దళితులపై దాడి చేసి హత్యాయత్నానికి ఒడిగట్టిన బాధితులను శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఏ.ఫ్రాన్సిస్ డిమాండ్‌చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత యువకులను ఆయన శనివారం పరామర్శించారు. గతంలో జనసేన సైనికులు పిఠాపురంలో దళితుల ఊరు మీద పడి దారుణంగా కొట్టారని, ఇప్పుడు కైకలూరులో అలాగే దాడులకు పాల్పడినా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఏమీ మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

**విచారణ జరిపించాలి**

కైకలూరు మండలం దానగూడెం దళితులపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి పోలీసు ఉన్నతాధికారులతో విచారణ జరిపించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. దోషులపై అట్రాసిటీ చట్టం పెట్టి అరెస్టు చేయాలని సీపీఎం జిల్లాకార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే హత్యలు, అత్యాచారాలు, దాడులను అరికడతామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ప్రశ్నించారు.

### బీవీ రాజు కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు



జాతీయస్థాయి గుర్తింపు సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

**భీమవరం :** భీమవరంలోని బీవీరాజు కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ విభాగంలో జాతీయస్థాయి గుర్తింపు దక్కించుకుందని ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు తెలిపారు. కేంద్ర విద్యా శాఖ ఈ నెల 4న విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఈ ఘనత సాధించిందని చెప్పారు. శనివారం రాజమహేంద్రవరంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎస్.ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ కేవీ స్వామి అభినందనలు తెలియజేస్తూ సర్టిఫికెట్ అందించారని వివరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందిని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ చైర్మన్ ఆర్.రవిచంద్రన్, సెక్రటరీ కె.ఆదిత్య విస్సం, జాయింట్ సెక్రటరీ కె.సాయి సుమంత్, డైరెక్టర్లు తదితరులు అభినందించారు.

### గర్భం దాల్చిన మైనర్ బాలిక

**ఏలూరు టౌన్:** మైనర్ బాలికకు ఓ వ్యక్తి మాయమాటలు చెప్పి ఆమె గర్భవతిని చేశాడు. బాలికకు అనారోగ్య సమస్య రావటంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ లంకగ్రామానికి చెందిన భార్యభర్త కొంతకాలం క్రితం గ్రామం నుంచి వలస వెళ్లి మహారాష్ట్రలోని పూణేలో చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మైనర్ బాలిక మాత్రం లంకగ్రామంలోనే తన అమ్మమ్మ వద్ద ఉంటూ 8వ తరగతి వరకూ చదివి ఇంటివద్దనే ఉంటుంది. 2024లో బాలికను తల్లిదండ్రులు తమతోపాటు పూణే తీసుకువెళ్లారు. అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి బాలికకు పరిచయం అయ్యాడు. ఒకే గ్రామానికి చెందిన వ్యక్తులమని పరిచయం చేసుకుని, బాలికతో సన్నిహితంగా మెలుగుతూ వచ్చాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. ఇటీవల బాలిక తన అమ్మమ్మ వద్దకు వచ్చింది. బాలిక అనారోగ్యంతో బాధపడుతూ ఉండడంతో హాస్పిటల్‌కు తీసుకువెళ్లగా ఆమెను పరీక్షించిన వైద్యులు 9నెలల గర్భవతిగా నిర్ధారించారు. ఏలూరు రూరల్ ఎస్సై నాగబాబు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు.

### నేల బావిలో పడి వ్యక్తి మృతి



బావిలో నుంచి వెలికి తీసిన మృతదేహం

**ముసునూరు:** ఇంటి సమీపంలో ఉన్న నేల బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ఎం.చిరంజీవి తెలిపిన వివరాలివి. వేల్పుచర్ల శివారు అన్నపనేని వారిగూడెంకు చెందిన ఉమ్మడి వెంకట నాగకిషోర్ (32) శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటి వెనుక గల నేల బావిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. ముసునూరు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం అగ్నిమాపక సిబ్బందిని రప్పించి, మృతదేహాన్ని బావిలోనుంచి బయటకు తీయించారు. నాగకిషోర్‌కు భార్య, 10 నెలల కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చెప్పారు.

### తాత్కాలికంగా గోదానం, గో దత్తత నిలుపుదల

**ద్వారకాతిరుమల:** రాష్ట్రంలో లంపి స్కిన్ వ్యాధి వేగంగా వ్యాపిస్తున్నందు వల్ల భక్తుల నుంచి గోదానాన్ని, అలాగే భక్తులకు ఇచ్చే గోదత్తతను శ్రీవారి దేవస్థానం తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అంటు వ్యాధులు తగ్గిన తరువాత మళ్లీ వీటిని పునః ప్రారంభిస్తామని, భక్తులకు ఆ విషయాన్ని తెలియజేస్తామని చెప్పారు.

## గణితం అంటే భయం పోగొట్టి..

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఉస్మాన్ పాషాకు పురస్కారం



**లింగపాలెం:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని ధర్మాజిగూడెం హైస్కూల్ ప్లస్ అధ్యాపకుడు ఉస్మాన్ పాషా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా అవార్డు అందుకున్న ఆయన తన ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. 2008 డీఎస్సీలో ఎంపికై వట్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన ఆయన 2023 నుంచి పీజీటీ (లెక్కలు) అధ్యాపకునిగా ధర్మాజీగూడెం హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్నట్లు చెప్పారు. వెనుకబడిన విద్యార్థుల కొనం వినూత్నమైన టీఎల్ఎం ఉపయోగించి ప్లేవే మెథడ్‌లో బోధించి మంచి ఫలితాలు సాధించానన్నారు. ఐసీటీ ద్వారా టెక్నాలజీని ఉపయోగించి స్వయంగా పీపీటీఎస్ యానిమేటెడ్ వీడియోలు తయారు చేయడం, జియోజీబ్రా, రోబో కంపాస్ లాంటి యాప్స్ ఉపయోగించి బోధించడం ద్వారా విద్యార్థుల్లో గణితం పట్ల భయాన్ని పోగొట్టడంతో దాదాపు పది మంది విద్యార్థులు ఐఐటీలో సీట్లు, ప్రతిభ అవార్డులు సాధించారన్నారు. ఎందరో విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక కావడంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నిర్వహించిన సాంకేతిక శిక్షణ నేస్తం సీబీటీ పోటీ పరీక్షల్లో స్టేట్ రెండవ ర్యాంకు సాధించి ఏపీ ఎస్సీఈఆర్‌టీ టెక్స్ట్ బుక్స్ ఆథర్‌గా సెలెక్ట్ అయ్యి గణిత పుస్తక రచనలో నూతన సేవలు అందించినట్లు వివరించారు. కోవిడ్ సమయంలో ఏలూరు ఏపీ టీవీ ఛానల్ ద్వారా యానిమేషన్ పీపీటీలు ఉపయోగించి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించినట్లు వివరించారు.

### వ్యాన్ బోల్తా.. 15 మంది కూలీలకు గాయాలు



ఏలూరు జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా పడిన దృశ్యం

**ఏలూరు టౌన్:** ఏలూరు నగర శివారు జాతీయ రహదారిపై రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో వ్యాన్ బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న 15మంది కూలీలు గాయాలపాలయ్యారు. తూర్పు గోదావరి జిల్లా తుని ప్రాంతానికి చెందిన కొందరు కూలీలు చేపల వేటకు వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ ప్రాంతానికి వెళ్లారు. పని ముగించుకుని వీరంతా వ్యాన్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఏలూరు జాతీయ రహదారిపైకి వచ్చే సరికి వాహనం టైర్ పంక్చర్ కావటంతో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పైకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కొందరికి చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ పోలీసులు 108 అంబులెన్స్‌ల్లో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. 15 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కావటంతో అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### నకిలీ కరెన్సీ ముఠా అరెస్ట్

**జంగారెడ్డిగూడెం:** నకిలీ కరెన్సీ ముఠాను జంగారెడ్డిగూడెం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ ఎంవీ సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకిలీ కరెన్సీతో ప్రజలను మోసం చేస్తున్నారన్న సమాచారం మేరకు డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో ఎస్సై షేక్ జబీర్, సిబ్బందితో కలిసి స్థానిక బాట గంగానమ్మ ఆలయ సమీపంలో తనిఖీ చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఏలేటి చంద్రశేఖర్ అలియాస్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ కిక్ (గోపాలపురం), లాగు శ్రీను (పేరంపేట), మోతరపు వంశీకుమార్ (నాగులగూడెం)లను అరెస్టు చేసి విచారించామన్నారు. వీరు నకిలీ రూ.500 నోట్లను నల్ల రంగులో ముద్రించి, ఈ నోట్లు ప్రత్యేక ద్రావణంలో ముంచితే అసలైన నోట్లుగా మారుతాయని ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. అలాగే నిజమైన నోట్ల కట్టగా చూపిస్తూ పైన, కింద అసలైన రూ.500 నోట్లు ఉంచి, మధ్యలో చిల్డ్రన్ బ్యాంక్ అని ముద్రించి ఉన్న నోట్లను ఉంచి మోసం చేస్తున్నారని తెలిపారు. వీరి నుంచి చిల్డ్రన్‌బ్యాంక్ అని ముద్రించి ఉన్న 255 రూ.500 నోట్లు, రూ.50 వేల నగదు, రసాయన ద్రావణం బాటిల్ -1, నకిలీ రూ.500 నోట్ల తరహాలో ఉన్న నల్ల కాగితాలు 10, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.